



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ కొండా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసేందుకు ర్యాలీగా వెళ్తున్న అంగన్వాడీలు

ప్రీ ప్రైమరీ బోధన బాధ్యత అంగన్వాడీలకు అప్పగించాలి

» కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నా చేసిన టీచర్లు, హెల్పర్లు

వికారాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ విద్య తరగతులను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని, బోధన బాధ్యతలను అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు వచ్చిన అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు ప్రధాన కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా ధర్నాలో పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకం కోసం డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోకి దూసుకువెళ్లేందుకు ప్రయత్నించగా, వారిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు, పోలీసులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సీఐటీయూ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భారతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణం అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల నినాదాలతో హోరెత్తిపోయింది.

నానో యూరియాతో ప్రయోజనం



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నానో యూరియాతో రైతులకు ప్రయోజనం ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజారత్నం అన్నారు. మంగళవారం రుద్రారంలో ఎరువుల దుకాణాలను ఏడీఏ శంకర్‌రాథోడ్, ఏవో తులసిలతో కలిసి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. నానో యూరియాతో భూసారం దెబ్బతినదని, తెగుళ్ల బెడద తగ్గుతుందన్నారు. అంతకు ముందు రావులపల్లి, చంద్రకల్, కస్తూర్‌పల్లి జంక్షన్ చెక్ పోస్టులను సందర్శించి యూరియా మళ్లింపును అరికట్టేందుకు చేపడుతున్న చర్యలను పర్యవేక్షించారు. పంటల నమోదు ప్రక్రియను నవంబరు 1లోగా పూర్తి చేయాలని ఏఈఓలకు సూచించారు.

జిల్లాలో గ్రామ పంచాయతీ, పరిషత్తు ఎన్నికలు నిర్వహించేందుకు గ్రామీణ ఓటర్ల లెక్క తేల్చారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు పరిష్కరించిన తర్వాత జిల్లాలో మొత్తం 6,98,478 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల యంత్రాంగం ప్రకటించింది. ఈ ఓటర్లలో 3,43,672 మంది పురుషులు ఉండగా, 3,54,790 మంది మహిళలు, 16 మంది ఇతర ఓటర్లు ఉన్నారు.



6,98,478

జిల్లాలో గ్రామీణ ఓటర్ల సంఖ్య

- తుది ఓటర్ల జాబితా విడుదల
- ముసాయిదాపై 4,138 అభ్యంతరాల స్వీకరణ
- లెక్క తేల్చిన జిల్లా యంత్రాంగం
- అత్యధికంగా తాండూరులో 46,646 మంది ఓటర్లు
- అత్యల్పంగా బంట్వారం మండలంలో 17,589 మంది

పంచాయతీలు
594

వార్డులు
5,058

పోలింగ్ కేంద్రాలు
5,058

ఓటర్ల వివరాలు

పురుషులు
3,43,672

మహిళలు
3,54,790

ఇతరులు
16



కోట్‌పల్లి మండలం, బార్వాద్ పంచాయతీ కార్యాలయంలో ఓటర్ల జాబితా ప్రతులను చూపుతున్న స్థానికులు

వికారాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గతనెల 28వ తేదీన ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాలపై ప్రజలు, రాజకీయ పార్టీల నుంచి 4,138 అభ్యంతరాలు వ్యక్తం కాగా, వాటిని పరిష్కరించిన తర్వాత మంగళవారం తుది ఓటరు జాబితాలను గ్రామ పంచాయతీ, మండల పరిషత్తు కార్యాలయాల్లో ప్రచురించారు. జిల్లాలో 20 మండలాల పరిధిలో 594 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటి పరిధిలో 5,058 వార్డులు ఉన్నాయి. పంచాయతీ ఎన్నికల కోసం ప్రతి వార్డుకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్న క్రమంగా జిల్లాలో 5,058 పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ఖరారు చేశారు. తుది ఓటర్ల జాబితా ఖరారు చేయడానికి ముందు జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో అధికారులు సమావేశాలు నిర్వహించిన విషయం తెలిసిందే. అత్యధికంగా తాండూరు మండలంలో 46,646 మంది ఓటర్లు,

మిగతా 8వ పేజీలో...

మండలాల వారీగా గ్రామీణ ఓటర్లు

మండలం	పురుషులు	మహిళలు	ఇతర	మొత్తం
బంట్వారం	8,555	9,034	-	17,589
కోట్‌పల్లి	10,492	10,935	-	21,427
మర్పల్లి	22,968	22,613	-	45,581
మోమిన్‌పేట్	19,616	19,959	01	39,576
వికారాబాద్	11,928	12,309	-	24,237
ధారూరు	17,797	18,464	-	36,261
బషీరాబాద్	19,452	21,538	-	40,990
తాండూరు	22,686	23,958	02	46,646
యాలాల్	18399	20309	01	38,709
పెద్దేముల్	19,804	21,024	-	40,828
బొంరాస్‌పేట్	15,894	16,226	-	32,120
దౌల్తాబాద్	20,017	20,952	05	40,974
దుద్యాల్	10,257	10,832	-	21089
కొడంగల్	15,782	16,423	-	32,205
కులకచర్ల	19,066	19,316	05	38,387
దోమ	22,056	22,129	-	44,185
చౌడాపూర్	12,742	12,413	01	25156
పరిగి	15,488	15,650	01	31,139
పూడూరు	21,738	21,855	-	43,593
నవాబ్‌పేట్	18,935	18,851	-	37,786
మొత్తం	3,43,672	3,54,790	16	6,98,478

రైల్వే సమస్యలను పరిష్కరించండి

» చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని రైల్వే సమస్యలను పరిష్కరించాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రైల్వే అధికారులను కోరారు. మంగళవారం ఆయన ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే అధికారులతో సమావేశమయ్యారు. ఉదయం రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, డీజీఎంలు ఉదయనాథ్, మాల్లాది శ్రీనివాస్, సీపీఆర్వో శ్రీధర్‌తో ఆయన బేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు రైల్వే సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా నావంద్గీ రైల్వే స్టేషన్‌లో హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌ను ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నిర్మాణంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల పురోగతిపై చర్చించారు. వికారాబాద్ - తాండూరు రహదారిపై ఆర్ఓబీలు, వికారాబాద్ పట్టణంలోని కోర్టు సమీపంలో, రామయ్యగూడ వద్ద రైల్వే ట్రాక్‌లపై నిర్మించనున్న ఆర్‌వోబీలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అలాగే శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ ఆధునీకరించాలని, మునిసిపల్ పరిధిలోని ఫతేపూర్ రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ఆర్‌యూబీ నిర్మించాలని కోరినట్లు తెలిపారు. ఎంపీ విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రైల్వే అధికారులు హామీ ఇచ్చారు.

పకడ్బందీగా నిమజ్జన ఏర్పాట్లు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం వెంకటాపూర్ నాడెం చెరువు వద్ద ఆమె నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాని, సీఐ రాజువర్మ, మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్, ఎస్ఐ శివకృష్ణ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీకి రైట్‌రైట్



- 50 ఎంబీబీఎస్ సీట్లతో ఎన్ఎంసీ అనుమతి
- ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు ప్రారంభం
- ఎడ్యుకేషన్ హబ్‌గా 'కొడంగల్'
- ఫలించిన సీఎం రేవంత్‌రెడ్డి కృషి

కొడంగల్/తాండూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటుకు నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యత ఇస్తూ ఇక్కడ ఇప్పటికే ఇంజనీరింగ్, నర్సింగ్, వెటర్నరీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, సమీకృత గురుకులాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం 2024లో కొడంగల్‌కు మెడికల్ కళాశాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం పాలనపరమైన అనుమతులు జారీ చేసింది. తాజాగా కళాశాలకు నేషనల్ మెడికల్ కమిషన్ 50 ఎంబీబీఎస్ సీట్లతో కళాశాలకు

మిగతా 8వ పేజీలో...



మెడికల్ కళాశాల నమూనా చిత్రం

అనుమతులు రావడం హర్షణీయం



కొడంగల్ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చడమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా స్థానికంగానే మెడికల్, ఇంజనీరింగ్, నర్సింగ్, వెటర్నరీ కళాశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పుడు మెడికల్ కళాశాల ఏర్పాటుకు ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయం.

-తిరుపతిరెడ్డి, కొడంగల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి

అటకెక్కిన కంప్యూటర్ విద్య!

- ముందుకు తీసుకెళ్లని తర్వాతి ప్రభుత్వం
- స్కూళ్లలో పాడవుతున్న కంప్యూటర్లు
- సాంకేతిక విద్యకు దూరమవుతున్న గ్రామీణ విద్యార్థులు

తొలుత 40 పాఠశాలల్లో తరగతులు ప్రారంభం



ఓ పాఠశాలలో నిరుపయోగంగా కంప్యూటర్లు

మేడ్చల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య అటకెక్కింది. లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన కంప్యూటర్లు పనికిరాకుండా పోతున్నాయి. పలు పాఠశాలల్లో ఏళ్లుగా కంప్యూటర్ విద్యను అందించకపోవడంతో విద్యార్థులకు ఆ విద్య అందడం లేదు. దినదినం సాంకేతిక విప్లవం కొత్త పుంతలు తొక్కుతున్న వేళ విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గ్రామీణ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సెక్సస్ స్కూళ్లుగా నామకరణం

ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులే కంప్యూటర్ రంగంలో దూసుకుపోతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు

మిగతా 8వ పేజీలో...

కంప్యూటర్ విద్యను కొనసాగించాలి



ప్రపంచం అంతా నేడు కంప్యూటర్ విద్య కోసం పరుగెడుతుంటే గ్రామీణ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య అందడం లేదు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించి ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను పునరుద్ధరించాలి. కంప్యూటర్ క్లాస్‌లు ప్రారంభమైతే గ్రామీణ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది.

-ప్రేమ్‌కుమార్, ఎస్టీయూ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు



వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం

వికారాబాద్‌లో వర్షం

వికారాబాద్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ పట్టణంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం సమయంలో కొద్దిసేపు వర్షం కురవగా, అనంతరం మళ్లీ ఎండ కొట్టింది. అయితే సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం పూర్తిగా చల్లబడి వర్షం కురిసింది. వర్షం క్రమక్రమంగా పెరుగుతూ తగ్గుతూ కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కాళేశ్వరంపై నిరాధార ఆరోపణలు

» మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



తబలా వాయిస్తూ మాట్లాడుతున్న ఆనంద్

వికారాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నిరాధార ఆరోపణలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆరోపించారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలోని ఆయన నివాసంలో రేవంత్ ప్రభుత్వానికి వినాయకుడు జ్ఞానోదయం కల్పించాలని కోరుతూ పాటలు పాడి వినూత్నంగా నిరసన తెలిపారు. నల్లబట్టలు ధరించి ప్రత్యేకంగా తబలా వాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వికారాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహించి అమరుల స్థూపాన్ని నీటితో శుద్ధి చేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కేసీఆర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్న భయంతోనే సీఎం రేవంత్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ వద్ద పిల్లర్లను కావాలనే కుంగగొట్టారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఓటుకు నోటు కేసు వల్ల రేవంత్‌రెడ్డి.. చంద్రబాబుతో చేతిలో కీలుబొమ్మగా మారారని ఆనంద్ విమర్శించారు. కార్యక్రమంలో మాజీ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, పట్టణ అధ్యక్షుడు గోపాల్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, అనంత్ రెడ్డి, సుభాన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కట్టకు పొంచి ఉన్న ముప్పు

కాలువ తీతతో కోతకు గురవుతున్న కట్ట

బషీర్‌బాయ్ చెరువుకు గండి

7

వేల సంఖ్యలో చేపలు మృతి

- రెండో రోజూ భారీగా మృత్యువాత
- ఆందోళనలో మత్స్యకార కుటుంబాలు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ డంపింగ్ వ్యర్థాలు ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో కలవడం వల్ల రెండు రోజులుగా పెద్ద సంఖ్యలో చేపలు మృత్యువాత పడుతున్నాయి. మంగళవారం ఉదయం మర్రిపల్లిగూడ, చెక్క బంగ్లా సమీపంలో లక్ష్మీనారాయణ చెరువులో చేపలు వేల సంఖ్యలో మృతి చెందాయి. గంగపుత్ర సంఘానికి చెందిన మత్స్యకారులు ఉదయాన్నే మృతి చెందిన చేపలను ఒడ్డుకు చేర్చారు. రెండురోజులుగా చేపలు చనిపోయి తమకు లక్షల రూపాయాల నష్టాన్ని మిగిల్చాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న చేప పిల్లలతో పాటు పెద్ద చేపలు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చేపలు పట్టుకొని జీవించే 600 గంగపుత్ర కుటుంబాల తమ జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జవహర్‌నగర్ డంపింగ్ వ్యర్థాలు చెరువులో కలువకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు. ఎరిమల్లేవాగు నీటిని దారిమళ్లించి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. కార్యక్రమంలో గంగ పుత్ర సంఘం అధ్యక్షుడు పూస యాదగిరి, కార్యదర్శి పూస నర్సింగ్ రావు, తదితరులు పాల్గొన్నారు.



మృతి చెందిన చేపలను చూపిస్తున్న మత్స్యకారులు

అక్రమ తవ్వకాలు జరిపితే చర్యలు

తాండూరు రూరల్, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి):అనుమతి లేకుండా తవ్వకాలు జరుపుతున్నారన్న ఫిర్యాదుతో అధికారులు స్పందించారు. ఓగీపూర్‌లోని సర్వే నంబర్-58లో అనుమతులు లేకుండా నాపరాతి తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో తాండూరుకు చెందిన నాపరాతి వ్యాపారి ఫసియొద్దీన్ లోకాయుక్తయు ఫిర్యాదు చేశాడు. మైన్స్ ఏడీ సత్యనారాయణ, సర్వేయర్ లక్ష్మీనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ నాగలక్ష్మి మంగళవారం ఓగీపూర్ వెళ్లి తనిఖీలు నిర్వహించారు. కొంత భూమి రెవెన్యూ పరిధిలోకి వస్తుందని ఏడీ తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. గనుల్లో అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


నాపరాళ్ల తవ్వకాలు చేస్తున్న వారిని హెచ్చరిస్తున్న ఆర్ఐ సుధ

నాపరాళ్ల గనుల్లో తనిఖీ

బషీరాబాద్ : అనుమతి లేకుండా నాపరాళ్లను తవ్వితే ఉపేక్షించేది లేదని బషీరాబాద్ ఆర్ఐ సుధ హెచ్చరించారు. మంగళవారం తహసీల్దార్ ఆదేశాలతో జీవన్గి నాపరాళ్ల గనుల్లో తనిఖీ చేశారు. దీంతో కొందరు తవ్వకాలను నిలిపి రోడ్డుపైకి రావడంతో ఆర్ఐ మాట్లాడి హెచ్చరించారు. సర్వే నంబరు 297 ప్రభుత్వ భూమిలో కొందరు తవ్వకాలు చేస్తున్నారని, తవ్వకాలను నిలిపి వేయాలన్నారు. ఈ అసైన్డ్ భూమిలో కొందరు అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారని ఆర్ఐకి దృష్టికి తెచ్చారు. కటింగ్ మిషన్లను తరలించాలని ఆర్ఐ ఆదేశించారు. మళ్లీ తవ్వకాలు జరిపితే కేసులు పెడతామని ఆర్ఐ హెచ్చరించి అక్కడినుంచి వెళ్లిపోయారు.

వికేంద్రీకృత మురుగునీటి శుద్ధీకరణ చేపట్టాలి

- నాగ్‌పూర్ హైడ్రోజియాలజీ విభాగం ఇన్‌చార్జి, సీఎంపీడీఐఎల్ మేనేజర్ రాంబాబుసింగ్

మొయినాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు వికేంద్రీకృత మురుగునీటి శుద్ధి చేపట్టాలని నాగ్‌పూర్ హైడ్రోజియాలజీ విభాగం ఇన్‌చార్జి, సీఎంపీడీఐఎల్(సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ లిమిటెడ్) మేనేజర్ రాంబాబుసింగ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధి చిలుకూరు సమీపంలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో సెప్టెంబరు 2నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే బలమైన గ్రామీణ, నగర సముదాయాల కోసం.. సస్టైనబుల్ వాటర్ అండ్ వేస్ట్ సెల్యూషన్స్ ఫర్ రెసిల్లియెంట్ రూరల్ అండ్ అర్బన్ కమ్యూనిటీస్(ఎస్‌డబ్ల్యూడబ్ల్యూఎస్)-2025 జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబుసింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మురుగునీటిని పెద్ద కేంద్రీకృత ప్లాంట్లకు తరలించకుండా.. దాని ఉత్పత్తి మూలం వద్దనే శుద్ధి చేయడం వల్ల నీటిని సురక్షితంగా పునర్వినియోగం చేసుకోవచ్చన్నారు. వ్యర్థ జలాలను శుద్ధి చేయడం ద్వారా నదులు, చెరువులు, భూగర్భ జలాలు, కలుషితం కాకుండా ఉంటాయన్నారు. చిన్న పరిశ్రమలు, గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని చిన్న చిన్న సముదాయాల్లో తక్కువ ఖర్చుతో వికేంద్రీకృత మురుగునీటి శుద్ధిని సమర్థవంతంగా చేపట్టవచ్చన్నారు. ఇలాంటి జాతీయ సదస్సులు స్థిరమైన పద్ధతుల్లో జ్ఞానాన్ని పంచుకోవడానికి, పరస్పర సహకారం, ఆవిష్కరణలకు ఉపయోపగడుతాయని ఆయన అన్నారు. సదస్సులో దేశవ్యాప్తంగా వివిధ సంస్థలకు చెందిన దాదాపు 60 మంది నిపుణులు, అధ్యాపకులు, కళాశాల డైరెక్టర్ రోహిత్, ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నర్సయ్య, కో-ఆర్డినేటర్ సౌమ్యసుచరితసంఫీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న రాంబాబు సింగ్ తదితరులు


బన్సీలాల్ వ్యాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చిరంజీవిగా నిలిచిన బన్సీలాల్ వ్యాస్

ఘట్‌కేసర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సేవాభావం, త్యాగనిరతితో గురుకుల్ పాఠశాల వ్యవస్థాపకులు బన్సీలాల్ వ్యాస్ ప్రజల్లో చిరంజీవిగా నిలిచారని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ గురుకుల్ వ్యవస్థాపకులు బన్సీలాల్ వ్యాస్ 69వ వర్ధంతి సందర్భంగా మంగళవారం గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. స్వాతంత్ర్యానికి ముందే 25ఎకరాల స్థలం కొని ఆశ్రమ పాఠశాలను నెలకొల్పిన మహనీయుడు వ్యాస్ అని కొనియాడారు. నగరంలోని హైటెక్ సీటీ ప్రాంతంలో వందలాది ఎకరాల భూమిని సేకరించారని తెలిపారు. హైటెక్ సీటీ గురుకుల్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఘట్‌కేసర్‌లోనూ గురుకుల్ పరస్థితి అధ్వానంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గురుకుల్ పరిరక్షణకు ప్రజలు ఉద్యమించాలని కోరారు. సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, రిటైర్డ్ అధ్యాపకులు, టీచర్లు, వ్యాస్ కుటుంబీకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

తాండూరు, సెప్టెంబర్2(ఆంధ్రజ్యోతి): తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మల్లినాథప్ప పాల్గొన్నారు.


అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

రైతుబజార్‌ను అభివృద్ధి చేస్తాం

చేవెళ్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని రైతుబజార్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని వసతులు కల్పించి అభివృద్ధి చేస్తామని చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు తెలిపారు. మంగళవారం రైతుబజార్‌లో మార్కెట్ నిధులతో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయించారు. మరుగు దొడ్లను బాగు చేయించారు. వారు మాట్లాడుతూ రైతులకు, వినియోగదారులకు ఇబ్బందుల్లేకుండా దశలవారీగా అన్ని వసతులు కల్పించి మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. రైతులు పండించిన కూరగాయలను నేరుగా రైతుబజార్‌లో అమ్ముకోవాలని సూచించారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి మహేందర్, డైరెక్టర్లు మల్లేష్, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, నరేందర్ పాల్గొన్నారు


రైతులతో మాట్లాడుతున్న పెంటయ్య గౌడ్

మౌలిక వసరుల కల్పనకు పెద్దపీట

కందుకూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసరుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆ పార్టీ మండల సీనియర్ నాయకుడు ఈ.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అగర్‌మియాగూడ గ్రామానికి రూ.5లక్షల వ్యయంతో మంజూరు చేసిన 80 ఎల్‌ఈడీ లైట్లను ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి చొరవతో తమ గ్రామానికి ఎల్‌ఈడీ లైట్లు మంజూరైనట్లు తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నాయకులు దిలీప్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్, రమేష్, విష్ణు, శ్రీకాంత్, రాజు, తదితరులు పాల్గొన్నారు.


ఎల్‌ఈడీ లైట్లను ప్రారంభిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

నందిగామ, సెప్టంబరు 2(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల మానవ వనరుల శాఖ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఎంఈవో పరిశుభ్రతపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు సురక్షితమైన మంచి నీరు, అబ్బాయిలకు, అమ్మాయిలకు వేర్వేరు మరుగుదొడ్లు ఏర్పాటు, సబ్బుతో చేతులు కడుక్కోవడం, మౌలిక వసతుల నిర్వహణ, పాఠశాలల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలను ప్రణాళిక పరంగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ఎంఈవో శ్రీనివాస్

14శాఖ గ్రంథాలయాల ఏర్పాటుకు తీర్మానం

శామీర్‌పేట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొత్తగా 14 శాఖ గ్రంథాలయాల ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీర్మానించిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం శామీర్‌పేట ప్రెస్‌క్లబ్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహాయాదవ్‌తో కలిసి మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 18 లైబ్రరీలు ఉన్నాయని తెలిపారు. కీసరలో నిలిచిన లైబ్రరీ భవన నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. దేవరయంజాల్, అలియాబాద్‌లలో నిర్మిస్తున్న గ్రంథాలయాలను దసరా నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

దెబ్బతిన్న పంటల పరిశీలన

బషీరాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): క్యాద్గీరాలో కాగ్నానది వరద ముంపునకు గురైన పొలాలను ఏఈవో వాసీం మంగళవారం పరిశీలించారు. నదీ పరివాహకంలో 20ఎకరాల వరకు ముంపుతో దెబ్బ తిన్న పొలాల నష్టాన్ని అంచనా వేశారు. పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిస్తామని రైతులకు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో టికెట్ ఇవ్వండి

బషీరాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో తనకు జెడ్పీటీసీ లేదా ఎంపీటీసీగా పోటీ చేసేందుకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్‌కు కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు శంకరప్ప మంగళవారం విన్నవించారు. హైదరాబాద్‌లోని ప్రసాద్‌కుమార్‌ను కలిసి బయోడాటాను అందజేశారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవాబుపేట, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. మంగళవారం ఆర్కతలలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి హాజరయ్యారు. రైతులు, ప్రజలకు అవసరాలకు అనుగుణంగా ఎస్బీఐ సేవలందిస్తోందన్నారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన ప్రీమియం రూ.436 చెల్లించి రూ.2లక్షల బీమా రక్షణ పొందొచ్చన్నారు. సురక్ష బీమా యోజన ప్రీమియం రూ.20తో రూ.2లక్షల బీమా సదుపాయం అందుతుందన్నారు. పంటల, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, రీకేవైసీ సేవలను ఎస్బీఐ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ ఏజీఎం తాన్యాశర్మ, డీజీఎంలు కుమార్‌రోహిత్, సతీశ్‌కుమార్, ఏజీఎం నితిన్‌కుమార్, రమ్య, ఎల్డీయం యాదగిరి, ఎంపీడీవో అనురాధ, ఏజీఎం ఎస్‌ఎల్‌బీసీ శ్రీహరి, నవాబుపేట బీఎం అరుణ్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.


బదిలీ అయిన సాంస్కృతిక విభాగం సభ్యులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

సంక్షేమ కార్యక్రమాలను ప్రచారం చేయాలి

వికారాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు తెలియజేస్తూ, పథకాలతో జీవన ప్రమాణాలు పెంచేలా కళారూపాలుండాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మంగళవారం తెలంగాణ సాంస్కృతిక సారథిలో పనిచేస్తున్న గారిపాక బిక్షపతి, చింతల స్వప్న రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. అదనపు కలెక్టర్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఆకుల చెన్నమ్మ, సిబ్బందితో కలిసి వారిని లింగ్యానాయక్ శాలువాలతో సన్మానించారు. కళారూపాలద్వారా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారం, పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యం తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు కళారూపాలు దోహదపడ్డాయన్నారు. వృత్తి ధర్మాన్ని పాటిస్తూ, సాంస్కృతి కార్యక్రమాల్లో నైపుణ్యాన్ని పెంచుకుంటూ ప్రజల్లో అవగాహన కల్పిస్తూ మన్ననలను పొందాలని ఆకాంక్షించారు.


సీహెచ్‌సీలో వైద్యులతో మట్లాడుతున్న డీఎంహెచ్‌వో లలితాదేవి

రోగుల పట్ల నిర్లక్ష్యం వద్దు

బషీరాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రులకు వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని వికారాబాద్ డీఎంహెచ్‌వో లలితాదేవి వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం నవాల్గ పీహెచ్‌సీ, బషీరాబాద్ సీహెచ్‌సీలను ఆమె తనిఖీ చేశారు. అందిస్తున్న తీరుపై ఆరా తీశారు. డీఎంహెచ్‌వో గోపాల్‌తో పలు అంశలపై చర్చించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తిం చెందకుండా ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీహెచ్‌సీ ఇన్‌పేషంట్లతో మాట్లాడారు. విలేఖర్లతో మాట్లాడుతూ.. గతేడాదితో జిల్లాలో డెంగీ కేసుల సంఖ్య 125 నమోదు కాగా ఈ సారి 43 కేసులు నమోదైనట్లు వివరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జ్వర సర్వే చేయిస్తున్నామని తెలిపారు.


అంతిరెడ్డిగూడలో మాట్లాడుతున్న గజేందర్‌గౌడ్

దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేద్దాం

షాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువుల్ని కొనుగోలు చేసి భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేద్దామని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడిగె గజేందర్‌గౌడ్ అన్నారు. బలరాముని జయంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని అంతిరెడ్డిగూడలో మంగళవారం రైతు దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ప్రధానమైన భారతదేశంలో 70 శాతం ప్రజలు వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్నారని, ప్రభుత్వాలు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలని, తద్వారా రైతులు ఆర్థిక పరిపుష్టి చెందుతారన్నారు. అధిక సుంకాల పేరుతో దేశాన్ని బలహీనపరిచే కుట్ర జరుగుతున్నట్లు ఆరోపించారు. సంఘం నాయకులు సత్యానారాయణరెడ్డి, చంద్రయ్య, రామస్వామి, నర్సింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

మంచాల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిధర్ అన్నారు. బెంగళూరులో రూ.5లక్షల వ్యయంతో రూపొందించిన పీఎస్‌ఎల్వీ నమూనాను ఆరుట్లలోని ప్రభుత్వ తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థుల సందర్శనార్థం ఉంచారు. ప్రధానోపాధ్యాయులు గిరిధర్ మాట్లాడుతూ క్షేత్ర ప్రదర్శనతో విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించబడతాయని చెప్పారు. మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సుప్రియ, మోహన్‌గౌడ్, యాదగిరి, జహీఆర్, పాపిరెడ్డి, జగదీష్, చందు, పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం

కులకచర్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): క్రీడలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. బండవెల్కిచర్ల ఎస్టీ గురుకుల పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ స్థాయి ఖోఖో పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాలు సాధించొచ్చన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మొగులయ్య, ఎంఈవో హబీబ్ అహ్మద్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, నాయకుడు గోపాల్‌నాయక్, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు


క్రీడా పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కొనసాగుతున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలు

శామీర్‌పేట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట జోనల్ స్థాయి క్రీడాపోటీలు మంగళవారం రెండోరోజు కొనసాగాయి. మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడలోని జీనియస్ హైస్కూల్లో జోనల్ స్థాయి టోర్నమెంట్ కమ్ సెలెక్షన్ పోటీలు గత సోమవారం ప్రారంభమయ్యాయి. క్రీడల కార్యదర్శి గుర్రం సత్తిరెడ్డి ఆధ్వర్యంలో క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారు. శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల 2,200మంది క్రీడాకారులు 180 టీమ్‌లుగా పోటీల్లో పాల్గొంటున్నారు. మంగళవారం ఖోఖోలో తలపడ్డారు. బుధవారం కబడ్డీ పోటీలను నిర్వహిస్తామని సత్తిరెడ్డి తెలిపారు.

ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల పోరుబాట

మోమిన్‌పేట్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డుకు భూములు, ప్లాట్లు కోల్పోతున్న నిర్వాసితులు పోరుబాట పట్టారు. మంగళవారం మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డితో కలిసి టేకులపల్లి, దేవరంపల్లి గ్రామాల రైతులు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. ట్రిపుల్ ఆర్‌కు ఇష్టారాజ్యంగా అలైన్‌మెంట్ చేస్తున్నారని, ఈ రోడ్డు ఉత్తర భాగంలో నిర్ధారించిన పరిహారం తమకు సరిపోదని మహేందర్‌రెడ్డి అన్నారు. టేకులపల్లి, దేవరంపల్లి గ్రామాల్లో 100 మంది రైతులు వందల ఎకరాలు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. రోడ్డు సర్వేను అడ్డుకుంటామని రైతులు తెలిపారు.


వర్క్‌షాప్ ముగింపులో వేడుకలో విద్యార్థులు

అనురాగ్‌లో ముగిసిన వర్క్‌షాప్

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో రెండురోజులుగా నిర్వహించిన 'ఎనిమాట్రిక్స్' వర్క్‌షాప్ మంగళవారంతో ముగిసింది. యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రానున్న కాలమంతా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌దేనన్నారు. వర్క్‌షాప్‌లో 157 మంది విద్యార్థులు పాల్గొని వారి సృజనాత్మకతను ప్రదర్శించారు. వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీన్‌లు మల్లికార్జున్‌రెడ్డి, కనకస్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా ఇచ్చేదాకా కదిలేది లేదు

- రైతుల ఆగ్రహం.. రాస్తారోకో


షాద్‌నగర్-కంది జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న పట్నం అవినాశ్‌రెడ్డి

యాచారం/ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు/షాబాద్/చౌదరిగూడ , సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమకు యూరియా ఇచ్చేదాకా కదిలేది లేదని రైతులు పీఏసీఎస్‌ల ఎదుట నిరసనకు దిగారు. ఈమేరకు మంగళవారం యాచారం సొసైటీ ఎదుట రైతులు ఉదయం గంటలకే వచ్చి 12 గంటల వరకు యూరియా కోసం వేచి చూశారు. అయితే, యూరియా ఇవ్వరని తెలిసి రైతులు నాగార్జున సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకోకు సిద్ధమవుతుండగా సీఐ నందీశ్వర్‌రెడ్డి సిబ్బందితో వచ్చి సముదాయించారు. బుధవారం సాయంత్రం వరకు యూరియా అందించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారని సీఐ రైతులకు చెప్పడంతో శాంతించారు. సరిపడా యూరియా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయాధికారి రవినాథ్ తెలిపారు. రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో రైతులతో కలిసి రాస్తారోకో చేశారు. ఆయన మాట్లాడుతూ యూరియా విషయంలో కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందని, ఇంతటి దౌర్భాగ్యం మరోటి ఉండదన్నారు. ప్రైవేట్ డీలర్ల గోదాంలలో యూరియా నిల్వలున్నప్పటికీ.. కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సీపీఎం నాయకులు సామేల్, చంద్రమోహన్, జగదీష్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆమనగల్లు పట్టణంలో బస్టాండ్ ఎదుట తలకొండపల్లి రోడ్డులో ఎరువుల దుకాణం వద్ద రైతులు బారులు తీరి నిలబడ్డారు. పెద్దమొత్తంలో యూరియా కోసం రావడంతో పోలీసు బందోబస్తు మధ్య ఏడీఏ శోభారాణి, ఏవో శ్రీనివాస్ గౌడ్‌లు యూరియా పంపిణీ చేశారు. ప్రతీ రైతుకు రెండు చొప్పున బస్తాలు అందజేశారు. అదేవిధంగా రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. షాబాద్‌లో షాద్‌నగర్-కంది జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. అవసరమైన సమయంలో యూరియా దొరక్కపోవడంతో పంట దిగుబడిపై ప్రభావం పడుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఔరైతులకు ఇబ్బందులు కలగకుండా చూసిందని, కాంగ్రెస్‌కు పాలన చేతకాకపోతే తప్పుకోవాలన్నారు. ధర్నాలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, మాజీ జడ్పీటీసీ రాజేందర్‌గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, మాజీ కోఆప్షన్ మెంబర్ చాంద్‌పాషా, మాజీ ఎంపీటీసీ మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచులు వెంకట్ యాదవ్, గోపాల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, నర్సింహారెడ్డి, దర్శన్, మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వీడాలి

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


సూదిని రాంరెడ్డి, కిషన్‌రెడ్డిలతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు/మాడ్గుల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హెచ్చరించారు. మాడ్గుల మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి పర్యటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మాడ్గుల గ్రామ పంచాయతీకి అదనంగా మంజూరైన 115 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, ఆమనగల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డిలతో కలిసి మంజూరు పత్రాలను ఎమ్మెల్యే కసిరెడ్డి అందజేశారు. లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో రూ.7.75 కోట్లతో నూతనంగా నిర్మించే అంతర్గత మురుగు కాల్వ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం స్థానిక రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని, ప్రజలకు ఇబ్బందులు కలిగించిన, అందుబాటులో లేకపోయినా ప్రభుత్వం అధికారులను ఉపేక్షించబోదన్నారు. మాడ్గులలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు సమాచారం ఇవ్వకపోవడం పట్ల ఎంపీడీవో, గృహ నిర్మాణ శాఖ ఏఈ, పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 115 మంది కి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైతే 60 మంది లబ్ధిదారులు మాత్రమే రావడమేమిటని, సమాచార లోపమే కారణమని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల ఇంత నిర్లక్ష్యం ఏమిటని పలువురు అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోని వారు వెళ్లిపోవచ్చని కసిరెడ్డి సున్నితంగా సూచించారు. కొందరు అధికారులు సమస్యలను పట్టించుకోవడం లేదని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. తహసీల్దార్ వినయ్‌సాగర్, ఇంచార్జి ఎంపీడీవో వేజన్న, ఏవో అరుణకుమారి, ఏఎంసీ డైరెక్టర్లు పల్లె జంగయ్యగౌడ్, రమేశ్‌గౌడ్, నాయకులు సూదిని కొండల్ రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాట్ల యాదయ్య, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న అడిషనల్ డీసీపీ పూర్ణచందర్

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

తలకొండపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నేర రహిత సమాజ నిర్మాణంలో సీసీ కెమెరాలు కీలకమని శంషాబాద్ అడిషనల్ డీసీపీ పూర్ణచందర్ అన్నారు. నేర పరిశోధన, నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంతో పాటు గట్టుఇప్పలపల్లిలో మంగళవారం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన 46 సీసీ కెమెరాలను షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మినారాయణ, ఆమనగల్లు సీఐ జానకిరాంరెడ్డితో కలిసి అడిషనల్ డీసీపీ పూర్ణచందర్ ప్రారంభించారు. అనంతరం ఎస్సై శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అన్నారు. ట్రాఫిక్ జామ్, రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం దాతలను అభినందించారు. తలకొండపల్లి ఎస్సైలు శ్రీకాంత్, శేఖర్, మాజీ సర్పంచ్‌లు లలిత జ్యోతయ్య, జయమ్మ, వెంకటయ్య, కానిస్టేబుల్ జాషువా తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆమనగల్లు సురసముద్రం చెరువు వద్ద గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పూర్ణచందర్ పరిశీలించారు. సీఐ జానకిరాంరెడ్డి, ఎస్సై వెంకటేశ్‌కు పలు సూచనలు చేశారు.

ఉత్సవాల విజయవంతానికి సహకరించాలి


వినాయకుడికి పూజ చేస్తున్న ఎస్పీ దంపతులు

వికారాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలను అవాంతరాలు లేకుండా విజయవంతంగా పూర్తి చేసుకునేలా పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నెలకొల్పిన వినాయక నిమజ్జనం సందర్భంగా ఎస్పీ కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నిమజ్జనం సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలుతీసుకోవాలని, నదులు, చెరువుల లోతులకు వెళ్లొద్దని సూచించారు. కార్యక్రమంలో ఉమెన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సరోజ, ఆర్ఐ అంజత్ పాషా పాల్గొన్నారు.

చెరువు కట్టకు పొంచి ఉన్న ముప్పు

- కాలువ తీతతో కోతకు గురవుతున్న కట్ట
- బషీర్‌బాయ్ చెరువుకు గండి


అలుగు పారేందుకు కట్టకు తీసిన కాలువ

పెద్దేముల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మారెపల్లి తండాలోని బషీర్‌బాయ్ చెరువు కట్ట కోతతో తెగేలా ఉంది. మరోవైపు కట్టకు గండిపడింది. అలుగు పారేందుకు కట్ట పక్కనుంచే కాలువచేయడంతో కోతకు గురవుతూ కట్టకు ప్రమాదం పొంచిఉంది. చెరువు నిండి అలుగు మత్తడి కింద భూమి నుంచి పారేంది. అయితే సదరు రైతు తనపొలం నుంచి అలుగు పారకుండా అడ్డ కట్ట వేసి కట్టకు అనుకొని జేసీబీతో కాలువతీశాడు. భారీ వర్షాలకు చెరువునిండి నీరు కట్టకు తీసిన కాలువ నుంచి పారుతూ కోతకు గురవుతోంది. దీంతో గ్రామస్థులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే చెరువుకట్టకు గండిపడి నీరు వృథాగా పోతోంది. అధికారులు తక్షణం చర్యలు చేపట్టాల్సి ఉంది.

కోతకు గురవుతున్నది వాస్తవమే



అలుగుపారే నీటికి అడ్డుకట్టవేసి కట్టకు కాలువ తీయడంతో చెరువుకట్ట కోతకు గురవుతోంది. ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్తా. కట్టకు పడిన గండిని పూడుస్తాం. చెరువులో నీరు ఉన్నందున తాత్కాలికంగా ఇసుక బస్తాలతో గండి పూడుస్తాం.

- ప్రవీణ్‌కుమార్, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్


రాణిరుద్రమ దేవిని సన్మానిస్తున్న ఆచారి, నాయకులు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

ఆమనగల్లు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీల అమలులో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ దేవి అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను బీజేపీ శ్రేణులు ప్రజల పక్షాన ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం రాణి రుద్రమ దేవి పర్యటించారు. ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ నాయకులు ఆమెకు స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో రాణి రుద్రమదేవి సమావేశమయ్యారు. కేంద్ర పథకాల అమలు, పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం గురించి చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలన దక్షతతో దేశం అద్భుత విజయాలు సాధిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను బీజేపీ శ్రేణులు గ్రామాల్లో గడప గడపకు తీసుకుపోవాలని సూచించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రేవంత్ సర్కార్ ప్రజలను మోసగించిందన్నారు. గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను హామీల అమలుపై ప్రజలు నిలదీయాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లను ప్రజలు విశ్వసించడం లేదని రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా నిలుస్తుందన్నారు. మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ఎర్రవోలు శ్రీను, బీజేపీ జిల్లా నాయకులు శ్రీకాంత్‌సింగ్, చెక్కాల లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నర్సింహ, నాయకులు రవిరాథోడ్, పద్మ ప్రశాంత్, ఎర్రవోలు మహేశ్, మల్లయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

దూర విద్యతో ఉజ్వల భవిష్యత్తు


సమావేశంలో ప్రొఫెసర్ ధర్మానాయక్

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దూర విద్య ద్వారా ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని, ప్రతీఒక్కరు దీనిని సద్వినియోగం చేసుకోవాలని డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ధర్మానాయక్ అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టడీ సెంటర్‌ను సందర్శించారు. స్టడీ సెంటర్ కౌన్సిలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కక్ సార్వత్రిక విశ్వవిద్యాలయం రెగ్యులర్ విశ్వవిద్యాలయాలతో సమానంగా దాదాపు అన్ని కోర్సులను అందుబాటులోకి తెచ్చిందన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ, జర్నలిజం, లైబ్రరీ సైన్స్, ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంబీఏ లాంటి కోర్సులను అందిస్తుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి డిగ్రీలో బీబీఏ కోర్సును ప్రవేశ పెట్టే ఆలోచనలో ఉందన్నారు. ఆసక్తి ఉన్న కోర్సులను పూర్తి చేయవచ్చన్నారు. మిగతా విశ్వవిద్యాలయాలతో పోల్చితే తమ సార్వత్రిక విశ్వవిద్యాలంలో ఫీజులు చాలా తక్కువని గుర్తు చేశారు. రెగ్యులర్‌గా డిగ్రీలు చేయలేనివారు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు, వ్యాపారస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దూర విద్య డిగ్రీకి సాధారణ డిగ్రీకి సమానమైన విలువ ఉంటుందన్నారు. ఆదివాసీలు, ట్రాన్స్‌జెండర్లు, వికలాంగులకు ఫీజు లేకుండా ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్ రాధిక, స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ డా.శంకర్‌నాయక్ తదితరులున్నారు.

హైటెన్షన్ విద్యుత్ లైన్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్న రైతులు


టవర్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

కడ్తాల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావిచెడ్‌లో 765 హైటెన్షన్ విద్యుత్ లైన్ నిర్మాణాన్ని రైతులు, గ్రామ నాయకులు అడ్డుకున్నారు. బీదర్ పవర్ గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ ఆధ్వర్యంలో బళ్లారి నుంచి మీర్‌ఖాన్ పేట వరకు హైటెన్షన్ విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కాగా, రైతుల ఆమోదం, పంచాయతీ తీర్మానం లేకుండా అలైన్‌మెంట్ చేయడం సరికాదని రైతులు అభ్యంతరం తెలిపారు. టవర్ నిర్మాణం వద్దకు వెళ్లి పనులను అడ్డుకొని నిరసన తెలిపారు. అలైన్‌మెంట్‌ను మార్చి తాము సాగు చేసుకొని జీవనం పొందుతున్న పొలాల మీదుగా విద్యుత్ లైన్ ఏర్పాటు సరికాదని రైతులు, నాయకులు అభ్యంతరం తెలిపారు. లైన్ నిర్మాణానికి తీసుకుంటున్న భూములకు మూడు రెట్లు మరోచోట భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయమైన పరిహారం అందించాకే పనులు చేపట్టాలని అడ్డుకున్నారు. సంబంధిత అధికారి సంతోష్ కుమార్ టవర్ నిర్మాణం వద్దకు చేరుకొని రైతుల డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతానని తెలిపారు. తాము సమ్మతించే వరకు పనులు చేపట్టవద్దని తెలిపారు. అనంతరం రైతులు కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్, నాయకులు జనార్దన్‌గౌడ్, దశరథం, అంజయ్య, రవి, రాములు, కర్ణాజీ, మోహనాజీ, సమ్మి, వినయ్, హైమావతి, రైతులు తదితరులు ఉన్నారు.

చిన్నారి ఆరోగ్యంపై ఎమ్మెల్యే ఆరా..



కడ్తాల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎక్వాయిపల్లికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ జోగు వీరయ్య మనుమడు శ్రవణ్‌ను మంగళవారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ పరామర్శించారు. జోగు శేఖర్ స్నేహలత కుమారుడు శ్రవణ్ ఆడుకుంటూ ఇటీవల ఇంటి మిద్దెపై నుండి కింద పడ్డాడు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న చిన్నారిని జైపాల్ యాదవ్ పరామర్శించి వైద్యులను ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అందిన రూ.2 లక్షల ఎల్‌వోసీని తల్లిదండ్రులకు అందజేశారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, తదితరులు ఉన్నారు.


మేడ్చల్ : పట్టణంలో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


కోట్‌పల్లిలో మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు అనిల్


పెద్దేముల్ పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులు

కాళేశ్వరంపై అసత్య ప్రచారం

● రెండు జిల్లాల్లో బీఆర్ఎస్ ఆందోళనలు

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని, కేసీఆర్‌ను ఇబ్బందిపెట్టేందుకే సీబీఐకి అప్పగించారని నిరసిస్తూ మంగళవారం వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు నిర్వహించాయి. ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. పట్టణాలు, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కేసీఆర్‌పై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


ధారూరులో బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు


బంట్వారంలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


పరిగి నిరసనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, తదితరులు


కీసర రూరల్: నాగారం మున్సిపాలిటీ రాంపల్లి చౌరస్తాలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


తాండూరు పట్టణం ఇందిరా చౌక్‌లో బీఆర్ఎస్ నాయకుల ధర్నా

ఓటరు జాబితా ప్రదర్శన



కొడంగల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా మంగళవారం మండల పరిషత్‌లో ఎంపీడీవో ఉషశ్రీ ఓటరు జాబితాను విడుదల చేశారు. మండలంలోని 25 పంచాయతీలకు సంబంధించి వార్డుల వారీగా తుది ఓటరు జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో జైపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పల్లెపల్లెకు బీజేపీ


కాళ్లాపూర్‌లోని లొంక ఆంజనేయస్వామి ఆలయం వద్ద బీజేపీ నాయకులు

పరిగి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నట్లు పార్టీ తాలూకా ఇన్‌చార్జి బి.మారుతికిరణ్ అన్నారు. పల్లెపల్లెకు బీజేపీలో భాగంగా మంగళవారం కాళ్లాపూర్‌లో లొంక ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే పల్లెపల్లెకు బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మండల అధ్యక్షురాలు అనసూయ, కేశవులు, రమేశ్, వీరేశ్, రాంరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంఘాలతో నాయకుల సమావేశం

ధారూరు, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి):బీజేపీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కేరెల్లిలో కుల, యువజన, మహిళా సంఘాలతో పార్టీ నాయకులు సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజునాయక్, నాయకులు పాండుగౌడ్, వివేకానందరెడ్డి, రాజేందర్ గౌడ్, ఎం.రమేశ్, వెంకటయ్య, నరేందర్‌రెడ్డి, కె.అంజయ్య తదితరులు పాల్గొన్నారు


కేరెల్లి గ్రామంలో స్థానికులతో సమావేశమైన బీజేపీ నాయకులు

బీఆర్ఎస్‌తో ఒరిగిందేమీ లేదు


యాలాల: కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

యాలాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ఆ పార్టీ నేతలు ప్రజాధనాన్ని దోచుకున్నారని యాలాల మండల కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం తాండూరులోని క్యాంప్ కార్యాలయంలో పార్టీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, భీమప్ప విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిల ఆధ్వర్యంలో మండలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతున్నారని చెప్పారు. కొందరు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. పేదలకు ఇళ్లు కట్టించడం, రేషన్‌కార్డుల మంజూరు, రైతు భరోసా, బీమా, ఆస్పత్రుల ఆధునికీకరణ వంటి ప్రజాసంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ పాలనతోనే సాధ్యమవుతున్నాయని తెలిపారు. ఇకపై ప్రభుత్వంపై, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఆయన సోదరుడు శ్రీనివాస్‌రెడ్డిలపై నిందలు మోపితే ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సంగెం ఖుర్దు హన్మంతు, జె.అమృతయ్య, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, యూత్ కాం గ్రెస్ అధ్యక్షుడు వీరేశం, నాయకులు రాజు, మహిపా ల్, వెంకటయ్య, చంద్రారెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పేదల కడుపు నింపడమే లక్ష్యం

కులకచర్ల: పేదల కడుపు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంతారంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్యతో కలిసి రేషన్‌కార్డు ప్రొసీడింగ్‌లను పంపిణీ చేశారు. గత ప్రభుత్వం కొత్తగా ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, యూత్ మండల అధ్యక్షుడు జంగయ్య, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అంతారంలో రేషన్‌కార్డు ప్రొసీడింగ్‌లు అందించిన నాయకుడు భీమ్‌రెడ్డి

ప్రజల గుండెచప్పుడు వైఎస్సార్


శామీర్‌పేట:మూడుచింతలపల్లి చౌరస్తాలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఎంసీ చైర్మన్ నర్సింహయాదవ్

యాలాల/కీసర/ఘట్‌కేసర్/ఘట్‌కేసర్ రూరల్/ధారూరు/మేడ్చల్ టౌన్/చౌడాపూర్/శామీర్‌పేట/పెద్దేముల్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): పేద వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. మంగళవారం ఆయన వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పేదల పెన్నిధి రాజశేఖర్‌రెడ్డి అని అన్నారు. ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత కరెంటు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు వైఎస్సార్ పాలనలో తెచ్చినవని, అవి నేటికీ కొనసాగుతున్నాయని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు. యాలాలలో తాండూరు-హైదరాబాద్ రోడ్డు మార్గంలో గల ఇందిరమ్మ కాలనీలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేశారు. పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, భీమప్ప, హన్మంతు పాల్గొన్నారు. కీసర మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ వర్ధంతిని నిర్వహించారు. నాయకులు రమేష్‌గుప్తా, శ్రావణ్‌కుమార్, లక్ష్మణ్, జూపల్లి రవి, అభిలాశ్, రమేష్, ప్రవీణ్, అన్వర్ హుస్సేన్ పాల్గొన్నారు. ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బి-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్, ముల్లి పావని, మాధవరెడ్డి, మామిడ్ల ముత్యాల్‌యాదవ్, మశ్చేందర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, రమేష్‌వామన్‌రెడ్డి, ఎం.జంగయ్య, డొంకెని శంకర్‌గౌడ్, కడుపోల్ల మల్లేష్, గంగి శంకర్ పాల్గొన్నారు. వైఎస్సార్ వర్ధంతిని ధారూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. కేరెల్లిలో చిత్రపటానికి నివాళులు అర్పించారు. చెన్నారెడ్డి, దయాకర్‌రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు. చౌడాపూర్ మండలం చాకల్‌పల్లిలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. శేఖర్, చంద్రశేఖర్, రాములు, బాల్‌రాజ్, వెంకటయ్య, విజయ్, చెన్నయ్య పాల్గొన్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ చెక్‌పోస్టు వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శంకర్, సంతోష్‌గౌడ్, దేవరాజ్, ఈశ్వర్, ఎస్.శ్రీనివాస్, మల్లేష్‌గౌడ్, రాజు పాల్గొన్నారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్ మూడుచింతలపల్లి మున్సిపాలిటీ చౌరస్తాలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళ్లర్పించారు. పెద్దేముల్ మండలంలో రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని నాయకులు జరుపుకున్నారు. మహిపాల్‌రెడ్డి, రియాజ్, శోభారాణి, ఉప్పరి మల్లేశం, విద్యాసాగర్, మినాజ్, బుజ్జమ్మ, వెంకటయ్య, షబ్బీర్, గోపాల్ పాల్గొన్నారు.


ధారూరు : కేరెల్లిలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


మేడ్చల్ టౌన్ : వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

అటకెక్కిన కంప్యూటర్ విద్య!

(ఐదో పేజీ తరువాయి)

ప్రాథమిక దశలోనే కంప్యూటర్ విద్యపై అవగాహన కల్పించేందుకు సక్సెస్ స్కూళ్లలో, జెడ్పీ పాఠశాలల్లో కంప్యూటర్ కోర్సులను బోధించడం ఆరంభించారు. విద్యా రంగంలో ఆంగ్ల మాధ్యమం వైపు తమ పిల్లలను విద్యాభ్యాసం చేయించేందుకు దృష్టిసారించడంతో 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కొన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసి వాటికి సక్సెస్ స్కూళ్లుగా నామకరణం చేశారు. విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు తెలుగు మాధ్యమంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో విద్య బోధన చేశారు. దీనికి తోడు కంప్యూటర్ విద్యపై అవగాహన కల్పించేందుకు గాను కంప్యూటర్ విద్యను ఆరంభించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ)తో అనుసంధానం చేసుకుని కంప్యూటర్ విద్యను ప్రవేశపెట్టారు. దీని ద్వారా ఉన్నత పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసే 8, 9, 10వ తరగతి చదివే విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించాలని నిర్ణయించారు.

ఒక్కో పాఠశాలకు 11 కంప్యూటర్లు..

మేడ్చల్ జిల్లాలో మండలానికి 4, 5 పాఠశాలల చొప్పున దాదాపు 40 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను ఆరంభించారు. ఆ తర్వాత దశల వారీగా మరికొన్ని చోట్ల ప్రారంభించారు. కంప్యూటర్ విద్యలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఎంఎస్ ఆఫీస్, యూజ్ ఆఫ్ కంప్యూటర్, తదితర అంశాలపై శిక్షణిచ్చేందుకు ఒక్కో పాఠశాలకు ఇద్దరు ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. వారికి రూ.4,500 నుంచి ఐదు వేల రూపాయల గౌరవ వేతనమిచ్చారు. అప్పటి ప్రభుత్వం ఐదేళ్ల వరకు ఎన్ఐటీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఐదేళ్లు గడిచిన తర్వాత అప్పటి ప్రభుత్వం దానిని కొనసాగించలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం కొన్ని పాఠశాలల్లో మాత్రమే కంప్యూటర్ విద్యను ప్రారంభించినప్పటికీ పాత వాటిని కొనసాగించలేదు. పాఠశాలల్లో ఆయా సబ్జెక్టులకు సంబంధించి విద్యా బోధన చేసే ఉపాధ్యాయులకే కంప్యూటర్ విద్యపై శిక్షణ ఇచ్చేలా నిర్ణయించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. దీని ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య అటకెక్కింది. ఒక్కో పాఠశాలకు 11 కంప్యూటర్‌లను అప్పటి ప్రభుత్వం అందజేసింది. పాఠశాలల్లో ఉన్న కంప్యూటర్లు వినియోగంలో లేక చెడిపోతున్నాయి. ఇప్పటికే చాలా పాఠశాలల్లో మానిటర్లు మినహా సీపీయూలు పనికిరాకుండా పోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండే మారుతున్న కాలానుగుణంగా కంప్యూటర్ విద్యను అందిస్తే విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయాలను విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న గణపయ్య పూజలు


మేడ్చల్ టౌన్: సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లోని రాఘవేంద్రనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మంగళవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల మహిళలు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: పోచారం పరిధి ఇస్మాయిల్‌ఖాన్‌గూడ హనుమాన్‌నగర్ అసోసియేషన్ ప్రతిష్ఠించిన గణనాథుడి నిమజ్జనాన్ని సోమవారం రాత్రి నిర్వహించా రు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంలో మాజీ సర్పంచ్ గోంగళ్ల మాధవిబాలేష్ రూ.62వేలకు దక్కించుకున్నారు.

పరిగి : పరిగిలో గణపతి విగ్రహాలు పూజలందుకుంటున్నాయి. వినాయక ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పరిగిలో 80కిపైగా మండపాల్లో వినాయకులను ఏర్పాటు చేశారు. మండపాలను రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు ప్రధానంగా పరిగిలో మండపాల వద్ద మైక్‌లతో భక్తులు హోరెత్తిస్తున్నారు.


పరిగిలోని బ్రాహ్మణవాడలో గణేశుడికి పూజ

సంక్షిప్తంగా..

● **దుద్యాల:** అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని దుద్యాల ఎస్సై యాదగిరి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవలే పరిగి, కులకచర్లలో చోటుచేసుకున్న పరిణామాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి వేళల్లో మేకలు, గొర్రెలు, పశువుల పాకల దగ్గర కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

● **కోట్‌పల్లి:** ఎన్నారంలోని పాఠశాలలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపు మోడ్‌ను ఎంఈవో చంద్రప్ప పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఆధార్ సమస్యలను పరిష్కరించేందుకు క్యాంప్ ఉపయోగపడుతుందన్నారు.

● **మోమిన్‌పేట్:** రైతులు పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఏవో జయశంకర్ తెలిపారు. కేసారం, మేకవనంపల్లి, మోమిన్‌పేట్, టేకులపల్లి, వెల్చాల్ గ్రామాల ఏఈవోలతో రైతు వేదికలో సమీక్షా నిర్వహించారు. రైతులతో మాట్లాడుతూ.. పంటలను నమోదు చేసుకుంటే ప్రభుత్వ పథకాలు, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మద్దతు ధర పొందొచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు స్వాతి, శ్రీనివాసులు, పెంటయ్య, చంద్రిక, శశాంక్ పాల్గొన్నారు.

● **దౌల్తాబాద్:** ఉపాధి హామీ కింద గ్రామాల్లో చేపట్టిన పనులపై మండల పరిషత్‌లో సామాజిక తనిఖీ నిర్వహించారు. 33పంచాయతీల్లో పనులపై తనిఖీ నిర్వహించారు. రూ.40వేల జరిమానా, రూ.17లక్షల రికవరీకి డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్ ఆదేశించారు. ఏపీడీ సరళ, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

● **తాండూరు:** కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 4న సాయితరుణ్ ఆస్పత్రిలో ఉచిత పల్మనరీ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. అపాయింట్‌మెంట్ కోసం ప్రజలు 8886668637 అనే నంబర్‌లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

క్రైం కార్నర్

రెండు బైక్‌లు ఢీ.. యువకుడి దుర్మరణం

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన కొమ్ము వంశీ(21) పోచారం చౌదరిగూడ సాయిబాబాకాలనీలో తల్లిదండ్రులతో పాటు ఉంటూ పెయింటింగ్ పనిచేస్తుంటాడు. సోమవారం పని ముగించుకొని అర్ధరాత్రి కొర్రెముల నుంచి చౌదరిగూడకు వస్తుండగా శ్రీసాయి ఎన్‌క్లేవ్ సమీపంలో ఎదురుగా వచ్చిన పల్సర్ బైక్ ఢీకొట్టింది. వంశీకి తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. పల్సర్ బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తరలించి, మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

సెల్‌ఫోన్ల అప్పగింతపై అద్దె బస్సు డ్రైవర్ల నిరసన

వికారాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులు నడిపించే సమయంలో సెల్‌ఫోన్ వినియోగించకుండా నిషేధం విధించడాన్ని నిరసిస్తూ ప్రైవేట్ డ్రైవర్లు డిపో వద్ద నిరసన వ్యక్తంచేశారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై ఆర్టీసీ నిషేధం విధించగా రంగారెడ్డి రీజియన్ వికారాబాద్ డిపోను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. డ్రైవర్లు విధుల్లో చేరే సమయంలో సెల్‌ఫోన్‌ను డిపో సెక్యూరిటీ కార్యాలయంలో అప్పగించాలి. విధులు ముగించుకుని వెళ్లే సమయంలో తీసుకోవాలి. సెల్‌ఫోన్ల అప్పగింత నిర్ణయాన్ని అద్దె బస్సుల డ్రైవర్లు వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. తమకు అత్యవసర కాల్స్ వస్తుంటాయని, సెల్‌ఫోన్లను అప్పగించం అని అన్నారు. విషయం తెలుసుకున్న డిపో మేనేజర్ వారితో మాట్లాడారు. సెల్‌ఫోన్ల అప్పగింతపై యాజమాన్యం జారీ చేసిన ఆదేశాలను అందరూ పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఇతర సమస్యలు ఏమైనా ఉంటే తన పరిధిలో పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. దీంతో వారు తమ నిరసనను విరమించి విధుల్లో చేరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కులకచర్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం రాంపూర్ ఎస్టీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. వంట గది, స్టోర్ రూమ్‌లను పరిశీలించి ప్రిన్సిపాల్ సబితతో మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాలతో జాగ్రత్తలు పాటించాలన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దోమకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బుచ్చిరెడ్డి మృతి బాధాకరం అని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం బుచ్చిరెడ్డి కుటుంబీకులను పరామర్శించి కుమారులు శివభాస్కర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలతో మాట్లాడారు. నాయకులు రాజిరెడ్డి, లక్ష్మయ్య, రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిర్మాణానికి భూమి పూజ

కొడంగల్/కొడంగల్ రూరల్/దుద్యాల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కొడంగల్ మండలం పర్సాపూర్, హస్నాబాద్‌లలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.ప్రశాంత్ భూమిపూజ నిర్వహించారు. హస్నాబాద్‌లో కడ(కొడంగల్ ప్రాంత అభివృద్ధి సంస్థ) నుంచి రూ.20లక్షలు మంజురయ్యాయని తెలిపారు. 8లక్షలతో పర్సాపూర్ అంగన్‌వాడీని నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ, ఎంపీవో జైపాల్‌రెడ్డి, పీఆర్ ఏఈ రవికిరణ్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. దుద్యాల మండలం హస్నాబాద్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎస్.ప్రశాంత్ భూమి పూజ నిర్వహించారు.


హస్నాబాద్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణ పూజలో నాయకులు

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

మర్పల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మార్కెట్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ మల్లేశ్, నాయకులు రవీందర్, నాగేశ్, నర్సిములు యాదవ్, అబ్రహం, సురేశ్, జగదీశ్వర్, వినోద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

6,98,478 ● గ్రామీణ ఓటర్లు


కోట్‌పల్లి మండలం మోత్కుపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ప్రచురించిన ఓటర్ల జాబితా

(ఐదో పేజీ తరువాయి)

అత్యల్పంగా బంట్వారం మండలంలో 17,589 మంది ఓటర్లు ఉన్నారు.

వికారాబాద్‌లో 182 పోలింగ్ స్టేషన్లు

వికారాబాద్ మండలంలో 21పంచాయతీలుండగా, వాటి పరిధిలో 182 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ధారూరులో 34పంచాయతీల్లో 286, మోమిన్‌పేట్‌లో 29పంచాయతీల్లో 256, బంట్వారంలో 12పంచాయతీల్లో 106, మర్పల్లిలో 29పంచాయతీల్లో 264, కోట్‌పల్లిలో 18 పంచాయతీల్లో 150పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తారు. తాండూరులో 33పంచాయతీల్లో 290, బషీరాబాద్‌లో 29 పంచాయతీల్లో 312, యాలాల్‌లో 29 పంచాయతీల్లో 318, పెద్దేముల్‌లో 28 పంచాయతీల్లో 308 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. కొడంగల్‌లో 25 పంచాయతీల్లో 222 పోలింగ్ స్టేషన్లు, దౌల్తాబాద్‌లో 33 పంచాయతీల్లో 290, బొంరాస్‌పేట్‌లో 35 పంచాయతీల్లో 292, దుద్యాల్‌లో 20 పంచాయతీల్లో 166 పీఎస్‌లను ఏర్పాటు చేస్తారు. పరిగిలో 32 పంచాయతీల్లో 268, పూడూరులో 32 పంచాయతీలోట్ల 282, కులకచర్లలో 33 పంచాయతీల్లో 280, చౌడాపూర్‌లో 202, దోమలో 36 పంచాయతీల్లో 208, నవాబ్‌పేట్‌లో 32 పంచాయతీల్లో 276 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తారు.

మెడికల్ కాలేజీకి రైట్‌రైట్

(ఐదో పేజీ తరువాయి)

అనుమతులిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది నుంచే కళాశాల ప్రారంభం కానుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవతో స్థానికత వివాదం తొలగింది. అడ్మిషన్ ప్రక్రియకు సైతం లైన్ క్లియర్ కావడంతో తెలంగాణలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 4,100కు చేరింది.

తాత్కాలికంగా తాండూరులో..

కొడంగల్‌లో కొత్త భవనం నిర్మిస్తున్నందున అప్పటి వరకు తాండూరులో తాత్కాలికంగా మెడికల్ కళాశాల కొనసాగనుంది. తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని జనరల్ ఆస్పత్రిగా నర్సింగ్ కళాశాలను మెడికల్ కాలేజ్‌గా మారుస్తున్నారు. ప్రస్తుతం నర్సింగ్ కళాశాల తాండూరు జిల్లా ఆస్పత్రి పీపీ యూనిట్ విభాగంలో కొనసాగుతోంది. త్వరలో మెడికల్ కాలేజ్‌కి సంబంధించిన గైడ్‌లైన్స్ రావాల్సి ఉంది. ఇప్పటికే మెడికల్ కళాశాల మిషనరీ చేరింది. 16 మంది ప్రొఫెసర్లు జాయినయ్యారు. ఈ వారంలో అసోసియేట్ ప్రొఫెసర్ జాయిన్ కావాల్సి ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు తెలిపారు. తాండూరులో తాత్కాలిక మెడికల్ కళాశాల ఏర్పాటుకు వైద్య విధాన పరిషత్ ప్రిన్సిపాల్ కార్యదర్శి, వైద్య శాఖడైరెక్టర్, కమిషనర్ బృందం పలుమార్లు తాండూరును సందర్శించి కళాశాల భవనాలను పరిశీలించిన విషయం తెలిసిందే.